క్లుప్తంగా

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎంపీ డీకే అరుణ



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ డీకే అరుణ

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ సమక్షంలో కేశంపేట మండలానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డితో పాటు 50 మంది యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గ్రామగ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, నర్సింహాయాదవ్, మహేశ్, నరేందర్‌రెడ్డి, అంజయ్య, శివాజీ, తిరుపతి, సతీశ్, దశరథ్, మల్లేశ్, భక్తవత్సల్, గణేశ్, విమల్, మధు, కుమార్‌గుప్తా, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నందిగామ: మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్‌చారి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. త్వరలోనే నందిగామ మండలాన్ని సందర్శించి అభివృద్ధి పనులకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అశోక్‌గౌడ్, నాయకులు అన్నారం రాజు, నర్సింహాగౌడ్, హేమంత్‌నాయక్, సత్యం, రాజశేఖర్, జంగయ్య, సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతకు పరామర్శ

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వకు చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహాను తన నివాసంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పరామర్శించారు. ఇటీవల నర్సింహా తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మందకృష్ణ అతడిని పరామర్శించి ధైర్యం కల్పించారు. ఆయన తండ్రి చిత్రపటానికి నివాళులర్పించారు.

డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో మంగళవారం డయాలసిస్ రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అపెక్స్ సెంటర్ ఇన్‌చార్జి రాజశేఖర్ మాట్లాడుతూ.. మానవుడి శరీరంలో కిడ్నీలు పాడైనప్పుడు డయాలసిస్ అవసరం అవుతుందన్నారు. డయాలసిస్ చేసినప్పుడు శరీరం నుంచి వ్యర్థాలు ఉప్పు, అదనపు ద్రవ్యం పేరుకుపోకుండా బయటికి పంపిస్తామన్నారు. డయాలసిస్‌తో అధిక సోడియం, పొటాషియం తదితర ఎలక్ట్రోలైట్లు సరైన స్థాయిలో ఉంటాయన్నారు. షాద్‌నగర్‌లో ప్రతి రోజు సుమారు 20 మంది రోగులకు డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలలో 480 మందికి షాద్‌నగర్ ఆస్పత్రిలో ఉన్న కేంద్రంలో డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగమణి, పద్మ, టెక్నీషియన్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి

పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన

నందిగామ: పనికి తగిన వేతనం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలోని పిత్తిల్యామినేషన్ పరిశ్రమలో గత కొంతకాలంగా వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం పనికి తగిన వేతనం చెల్లించడం లేదని ఆరోపిస్తూ మంగళవారం పరిశ్రమ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొంత కాలంగా వెల్డింగ్ పనులు చేస్తున్న తమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. పనికి తగిన వేతనాలు చెల్లించే వరకు విధుల్లోకి చేరబోమని డిమాండ్ చేశారు. పలువురు కార్మిక సంఘాల నాయకులు పర్వతాలు, ఆశోక్, సాయిబాబు కార్మికులకు మద్దతు పలికారు. ఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కార్మికులతో మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ విషయమై యాజమాన్యాన్ని వివరణకోరగా.. నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నామని, కావాల్సిన వసతి, సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.



గుంతలమయంగా సురంగల్ రోడ్డు



అధ్వానంగా శ్రీరాంనగర్ రోడ్డు

అధ్వాన రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- గుంతల దారులతో వాహనదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: మొయినాబాద్‌లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్ల పరిస్థితి అడుగుకో గుంత.. గజానికో గొయ్యి అన్న చందంగా మారింది. మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఏ గ్రామం రోడ్డు చూసినా అధ్వానంగానే ఉంది. రోడ్లపై వెళ్లడానికి వాహనదారులు, స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. మొయినాబాద్ నుంచి సురంగల్ మీదుగా శ్రీరాంనగర్ వెళ్లే రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడటంతో పది నిమిషాల్లో వెళ్లాల్సిన దూరం అరగంటకు పైగా సమయం పడుతోంది. పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు, కనకమామిడి-వెంకటాపూర్ రోడ్డు, తోలుకట్ట- నక్కలపల్లి రోడ్డు, నాగిరెడ్డిగూడ-బాకారం రోడ్డు పరిస్థితి ఇదే తీరులో ఉంది. ఆయా గ్రామాల రోడ్లకు పదేళ్ల క్రితం బీటీ వేసి వదిలేశారు. ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో పూర్తిగా గుంతలయమంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు, ప్రజలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్లపై వాహనాల్లో వెళ్లేవారికి నడుములు పట్టేస్తున్నాయని.. ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు.. ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ.5.54కోట్లతో పరిగి రోడ్డుకు మరమ్మతులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నిధుల మంజూరు పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పరిగి రోడ్డుకు రూ.5.54 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ చౌరస్తా నుంచి కిషన్‌నగర్ వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పైపులు పరిగి రోడ్డు మధ్యలో ఉండటంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని, ఫలితంగా రోడ్డు మొత్తం గుంతలుగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. సుమారు కిలోమీటర్నర మరమ్మతులకుగాను రోడ్డు భవనాలశాఖ నిధులు మంజూరు చేసిందని స్పష్టం చేశారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, నెలరోజుల్లో మరమ్మతులు ప్రారంభిస్తామని తెలిపారు. అదేవిధంగా రోడ్డు మధ్యలో డివైడర్, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తామని, మరమ్మతులు పూర్తయితే పరిగి రోడ్డు రూపురేఖలు మరింత మారిపోతాయన్నారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందుకుగాను కావాల్సిన నిధులు మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో నాయకుడు కాశీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



శంకర్‌పల్లి: మట్టి వినాయకులతో విద్యార్థులు, ఎన్‌సీడీ బృందం

షాబాద్: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంగా మట్టి వినాయకులను తయారు చేసి పూజించారు. మట్టి వినాయకులనే పూజించి.. పర్యావరణాన్ని కాపాడేందుకు నడుం బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు తప్పకుండా మట్టి గణపతినే పూజించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, ఇతర రసాయనాలతో తయారుచేసిన వినాయకుడి ప్రతిమల నిమజ్జన సమయంలో జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు విగ్రహాల పంపిణీ

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని హెచ్‌ఎం జీవన జ్యోతి అన్నారు. మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు నిఖిల కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలపర్స్(ఎన్‌సీడీ) వారు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయక విగ్రహాల కారణంగా పర్యావరణం విషతుల్యం అవుతుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని, మట్టి వినాయకులను ప్రతిష్ఠించి, పూజించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, మహేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: ఎంపీడీఓ సంధ్యకు మట్టి విగ్రహాన్ని అందిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

మొయినాబాద్‌రూరల్: మట్టి గణపతి విగ్రహాలను పూజించుకుందాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. బుధవారం జోగన్‌పల్లి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల హౌజింగ్ ఏఈ సుష్మ, అధికారులు, ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

షాబాద్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై పనిముట్లు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ యాంత్రీకరణలో భాగంగా సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణపై ఉప-మిషన్ పథకం ద్వారా 40-50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు బడ్జెట్ కేటాయించారన్నారు. మండలానికి బ్యాటరీ స్ప్రేయర్లు-177, తైవాన్ స్ప్రేయర్లు-30, రోటవేటర్లు-09, ట్రాక్టర్ సంబంధిత పనిముట్లు(కల్టివేటర్, డిస్క్ హారో, ఎంబీప్లవ్, కేజీవీల్స్)-11, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్స్-02, బ్రష్ కట్టర్-03, మేజ్ షెలర్-01 వచ్చినట్లు తెలిపారు. ఈ రాయితీని పొందేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. దరఖాస్తుదారుడి పేరుమీద భూమి ఉండాలన్నారు. భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, రైతు ఫొటో, ట్రాక్టర్ ఆర్సీ(ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు మాత్రమే)తో ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 29, 30 తేదీల్లో డీడీ కట్టుకోవాలని, ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రం జతచేయాలని తెలిపారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడిన రైతులు

చేవెళ్ల: యూరియా కోసం మండలంలో రైతులు పీఏసీఎస్‌ల వద్దకు పరుగులు తీశారు. చేవెళ్ల పీఏసీఎస్ గోదాంకు 20 టన్నుల యూరియా వచ్చిందని.. తెలియటంతో మంగళవారం అవసరం ఉన్న రైతులు వచ్చి తీసుకెళ్లటంతో సాయంత్రంలోపు యూరియా మొత్తం అయిపోయింది. మండలంలో యూరియా ఎక్కడ అందుబాటులో లేకపోవటంతో చేవెళ్ల పీఏసీఎస్‌లోనే ఉన్న 20 టన్నుల యూరియాను వ్యవసాయాధికారులు, పీఏసీఎస్ సిబ్బంది కలిసి అందరికీ అవసరం మేరకు అందించాలని ఒక రైతుకు రెండు బస్తాల చొప్పున రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డులను పరిశీలించి అందజేశారు. వచ్చిన యూరియా ఒక్కరోజులోనే అయిపోయింది. కొంత మంది రైతులకు యూరియా దొరకపోవటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మండలంలోని ముడిమ్యాల, ఆలూరు, చేవెళ్ల పీఏసీఎస్ గోదాంలతో పాటు మనగ్రోమోర్ కేంద్రాలకు 60 టన్నులకుపైగా యూరియా రెండురోజుల్లో రాబోతుందని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తెలిపారు. మండలంలో రైతులకు ఎలాంటి కొరత లేదని, గతంలో కూడా కావాల్సిన యూరియాను అందించామని ఇప్పుడు కూడా కావాల్సిన దానికంటే ఎక్కువగానే వస్తుందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. మండలంలో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉంచేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సౌండ్ బాక్సుల అందజేత



మండపాల నిర్వాహకులకు సౌండ్ బాక్సులు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో వినాయక మండపాలకు గ్రామానికి చెందిన యువనాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ మంగళవారం సౌండ్ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని యువజన సంఘాల నాయకులు, వివిధ మండపాల నిర్వాహకులు గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా ఉత్సవాలను ఐకమత్యంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, రవినాయక్, సందీప్‌నాయక్, శ్రీనునాయక్, సురేశ్‌కుమార్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు



షాబాద్: మద్దూరులో గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పీపీఆర్ వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మద్దూరు, రేగడిదోస్వాడ గ్రామాల్లో గొర్రెలకు, మేకలు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు ఎటువంటి రోగాలు ప్రబలిన వెంటనే పశువైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాల్‌రాజ్, గోపి, కృష్ణమూర్తి, సుధాకర్, రైతులు తదితరులు ఉన్నారు.



శంకర్‌పల్లి: టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి మానసరెడ్డి

టీకాలు తప్పనిసరి వేయించాలి

శంకర్‌పల్లి: మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలని శంకర్‌పల్లి పశువైద్యాధికారి మానసరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నశంకర్‌పల్లి, మండలంలోని మోకిల, మహాలింగాపురం గ్రామాల్లో మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

కొత్తూరు: మేకలు, గొర్రెల పెంపకంలో కాపరులు సరైన జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యురాలు స్ఫూర్తి అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో మంగళవారం గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, రవి, కాపరులు పాల్గొన్నారు.

కట్టకు గండి పూడ్చివేత



ఎర్రకుంటకు మట్టితో గండిని పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: రైతులకు ఉపయోగపడుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని ప్రభుత్వం చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కురిసిన వర్షాలకు వరదనీరు వృథాగా పోతోంది. ఈ విషయమై ఎర్రకుంటకు మరమ్మతులెప్పుడో అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మండల పరిధిలోని బాకారం ఎర్రకుంటకు భారీ వర్షాలకు నిండుగా నీరు నిండి గండిపడి కట్ట కొట్టుకుపోయింది. దీంతో ఎర్రకుంటలోని నీరంతా వృథాగా పంటపొలాల నుంచి ఈసీ వాగులోకి ప్రవహించింది. ఎర్రకుంట చుక్క నీరు లేక పిచ్చిమొక్కలతో ఎడారిగా దర్శనమిస్తోంది. స్పందించిన అధికారులు జేసీబీ సాయంతో కట్టను పూడ్చారు. దీంతో చుట్టుపక్కన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే ఈ కుంటలో నీరు నిలిచి ఉంటుందని పేర్కొంటున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవుల మృతి



మొయినాబాద్‌రూరల్: మృతి చెందిన ఆవు వద్ద రోధిస్తున్న రైతు మక్బూల్

మొయినాబాద్‌రూరల్: గడ్డి మేస్తూ విద్యుత్ షాక్ తగిలి ఆవు మృతి చెందిన సంఘటన తోల్‌కట్ట గ్రామంలో జరిగింది. బాధితుడు మక్బూల్, తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తోల్‌కట్ట గ్రామానికి చెందిన మక్బూల్ అనే రైతు తన వద్ద ఉన్న మూడు ఆవులను రోజు మాదిరిగానే మంగళవారం మేపడానికి గ్రామ సమీపంలోకి వెళ్లారు. అక్కడ ఓ ఫామ్‌హౌస్ పక్కన ఆవుకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన ఆవు 90 వేల ఖరీదుతో కొద్దిరోజుల క్రితమే మక్బూల్ కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

దైవాలగూడలో..

షాబాద్: విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు భాదిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడ గ్రామానికి చెందిన తాళ్లపల్లి అనిల్ తన పాడి ఆవును తన పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి షాక్ కొట్టడంతో పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. రోజుకు 10 లీటర్ల పాలు ఇచ్చే పాడి ఆవు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో రైతుల బోరున విలపించాడు. దాని విలువ సుమారు రూ.1.లక్ష 30 వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందజేయాలని రైతు కోరారు.

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా మా క్లయింట్లు చిగుర్లపల్లి కృష్ణారెడ్డి తండ్రి లేటు అంజిరెడ్డి, చిగుర్లపల్లి సతీష్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి మరియు చిగుర్లపల్లి పుష్పలతరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి నివాసం:ఇ.నం.2-70, వెల్జచిల్కమర్రి గ్రామం, ఫరూఖ్‌నగర్ మం॥, రంగారెడ్డి జిల్లా-509216 వారు గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి, రంగారెడ్డి జిల్లా ఎట్ షాద్‌నగర్ వారి ఫైల్‌పై రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మం॥, చిల్కమర్రి (వెల్జ) గ్రామం వద్దగల సర్వే నం.117/AA/7లోని ఎ.2.10 గుంటలు, సర్వే నం.117/AA/1/2లోని ఎ.0.2650 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎ.2.3650 గుంటల భూమికి సంబంధించి వద్యాల యాదమ్మ భర్త వద్యాల నారాయణరెడ్డి ఎగ్జిక్యూట్ చేసిన డాక్యుమెంట్ నం.2198 ఆఫ్ 2025, తేది:17-07-2025 కలిగిన రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌ను చెల్లనిదిగా మరియు కృష్ణారెడ్డి తండ్రి లేటు అంజిరెడ్డి, చిగుర్లపల్లి సతీష్‌రెడ్డిలకు బాధ్యత ఉండదని ప్రకటించవలసిందిగా మరియు రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మం॥, చిల్కమర్రి (వెల్జ) గ్రామం వద్దగల సర్వే నం.116/AA/2/2లోని ఎ.2.3650 గుం.ల విస్తీర్ణం గల భూమికి సంబంధించి తూమ్ సంయుక్తరెడ్డి భర్త తూమ్ సంజీవరెడ్డి పేరున వద్యాల యాదమ్మ భర్త వద్యాల నారాయణరెడ్డి ఎగ్జిక్యూట్ చేసిన డాక్యుమెంట్ నం.2199 ఆఫ్ 2025, తేది:17-07-2025 కలిగిన రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌ను చెల్లనిదిగా మరియు చిగుర్లపల్లి పుష్పలతరెడ్డి తండ్రి కృష్ణారెడ్డికి బాధ్యత ఉండదని ప్రకటించవలసిందిగా మరియు పై ఆస్తులను మూడవ పార్టీలకు అన్యాక్రాంతం చేయుట లేదా బదిలీ చేయుట నుండి తూమ్ సంజీవరెడ్డి తండ్రి తూమ్ సాయిరెడ్డి మరియు తూమ్ సంయుక్త రెడ్డి భర్త తూమ్ సంజీవరెడ్డి లేదా తూమ్ సంజీవరెడ్డి తండ్రి తూమ్ సాయిరెడ్డి మరియు తూమ్ సంయుక్త రెడ్డి భర్త తూమ్ సంజీవరెడ్డి ద్వారా క్లెయిమ్ చేస్తున్న వారి ఏజెంట్లు ప్రతినిధులు ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులను నిరోధించవలసిందిగా పర్మనెంట్ మరియు శాశ్వత ఇంజక్షన్ కొరకు వద్యాల యాదమ్మ భర్త వద్యాల నారాయణరెడ్డి, తూమ్ సంజీవరెడ్డి తండ్రి తూమ్ సాయిరెడ్డి మరియు తూమ్ సంయుక్త రెడ్డి భర్త తూమ్ సంజీవరెడ్డిలపై O.S.No.114 ఆఫ్ 2025లో దావా దాఖలు చేశారు. ఇందువలన, తూమ్ సంజీవరెడ్డి తండ్రి తూమ్ సాయిరెడ్డి, వయస్సు సుమారు 67 సం॥రాలు, వృత్తి:వ్యవసాయం, నివాసం:ఇ.నం. 13-136/3, భాగ్యనగర్ కాలనీ, షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్ మం॥, రంగారెడ్డి జిల్లా-509216 వారి నుండి రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మం॥, చిల్కమర్రి (వెల్జ), గ్రామం వద్దగల సర్వే నం.117/AA/7లోని ఎ.2-10 గుంటలు, సర్వే నం.117/AA/1/2లోని ఎ.0.2650 గుంటలు, మొత్తం ఎ.2.3650 గుంటల విస్తీర్ణం గల భూమిని మరియు తూమ్ సంయుక్త రెడ్డి భర్త తూమ్ సంజీవరెడ్డి, వయస్సు సుమారు 60 సం॥రాలు, వృత్తి:గృహిణి, నివాసం:ఇ.నం.13-136/3, భాగ్యనగర్ కాలనీ, షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్ మం॥, రంగారెడ్డి జిల్లా-509216 వారి నుండి రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మం॥, చిల్కమర్రి (వెల్జ), గ్రామంలోని సర్వే నం.116/AA/2/2లోని ఎ.2.3650 గుంటల విస్తీర్ణం గల భూమిని కొనుగోలు చేయరాదని ఇందుమూలంగా సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. ప్రస్తుత హెచ్చరిక ప్రచురణ తర్వాత కూడా ఎవరైనా సదరు భూమిని కొనుగోలు చేయుటకు ముందుకు సాగితే వాటి వ్యయాలు, పర్యవసానాలకు అతను/ఆమె పూర్తిగా బాధ్యత వహించవలసి ఉంటుంది.

Sd/- (K. జయ భరత్ రెడ్డి) మారెడ్డి నికిత రెడ్డి న్యాయవాదులు, ప్రగతినగర్, SBI కాలనీ, LB నగర్, హైదరాబాద్-84 సెల్ : 9010044288

ఉపాధ్యాయుల కోసం ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

కొందుర్గు: పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి విద్యార్థులు, గ్రామస్తులు లాల్‌పహాడ్ చౌరస్తాలో రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు స్వరూప మాట్లాడుతూ.. తమ గ్రామంలోని పాఠశాలలో 1 నుంచి 7 తరగతులకుగాను 100 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి బోధించడానికి 8 మంది ఉపాధ్యాయులు అవసరం. కానీ ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో విద్యాబోధన సాఫీగా సాగడం లేదు. ఇటీవలే పాఠశాల హెచ్‌ఎం శంకర్‌కు పదోన్నతి లభించింది. ఇటీవల డీఈఓ కార్యాలయం నుంచి పాఠశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూయించి, తిరిగి తొలగించడంలో ఆంతర్యమేమిటనీ ప్రశ్నించారు. తమ పాఠశాల నుంచి ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీ చేస్తారు. కానీ తమ పాఠశాలకు తిరిగి ఉపాధ్యాయులను కేటాయించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల బాలయ్య, హజం, హర్షద్, శ్రీధర్, పాపయ్య, మధు, ప్రశాంత్, లాయిక్, శ్రీను, భాను, భానుప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు



ఏఎల్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు, కార్మికులు

షాద్‌నగర్‌రూరల్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్‌ఓ) కార్యాలయం ఎదుట మంగళవారం భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల ఆన్‌లైన్ దరఖాస్తులను అప్‌డేట్ చేయాలన్నారు. క్లెయిమ్స్ 2009 నుంచి రెన్యూవల్స్ చేయాలని, ఆధార్ లింక్ ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. కార్మికుడి పేరు తప్పుగా నమోదైనా, చలానా ఫొటో రాకున్నా సంబంధిత అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్‌ఓ) సరిచేయాలని కోరారు. కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారి కష్టాలను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.